తెలుగుదనం ఉట్టిపడేలా.. ఉగాది ఉత్సవం



పొయ్యిపై బక్షాలు చేసి అందజేత

ఆరు రుచులతో పచ్చడి తయారు చేసిన విద్యార్థులు

ఎస్‌పీఆర్ గ్లోబల్ స్కూల్ సౌజన్యంతో 'సాక్షి' ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

ముందస్తు ఉగాది వేడుకలతో ఎస్‌పీఆర్ గ్లోబల్ స్కూల్‌లో గురువారం పండుగ సందడి నెలకొంది. సంప్రదాయ దుస్తువులతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. విద్యార్థినులు ఆరు రుచులతో కూడిన ఉగాది పచ్చడి చేసి, టీచర్లు పొయ్యిపై బక్షాలు చేసి పంచి పెట్టారు. సందడితో పాఠశాలలో పల్లెటూరి వాతావరణం ఉట్టిపడింది. విద్యార్థి అయ్యగారి వేషధారణలో పంచాంగాన్ని చదివారు. పూజలు నిర్వహించి శ్రీవిశ్వ వసునామ సంవత్సరానికి స్వాగతం పలికారు.

సుభాష్‌నగర్





గాజుల రామారం డివిజన్ శ్రీ చిత్తారమ్మ దేవినగర్‌లోని ఎస్‌పీఆర్ గ్లోబల్ స్కూల్, 'సాక్షి' ఆధ్వర్యంలో రెండు రోజుల ముందే గురువారం జరిగిన ఉగాది పండుగ వేడుకలు అంబరాన్నంటాయి. సంప్రదాయ దుస్తుల్లో తెలుగుదనం ఉట్టిపడే విధంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు చేసిన ఉగాది వేడుక పల్లెటూరి వాతావరణాన్ని తలపించింది. తిమిరాన్ని పారదోలే ఉషోదయంలా శ్రీ క్రోధి నామ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నవరాగాల కోయిల అడిగిడుతున్న ఉగాది పండుగ 'శ్రీవిశ్వ వసునామ' సంవత్సరానికి స్వాగతం పలికారు. విద్యార్థులు, టీచర్లు సంప్రదాయ దుస్తులు ధరించి ముందుగా పూజలు నిర్వహించారు. అనంతరం స్కూల్ ఆవరణలో పచ్చడిని, విద్యార్థులు, టీచర్లు మట్టి పొయ్యిపై పోలెలు(బక్షాలు) తయారు చేశారు.



నూతన సంవత్సర పంచాంగం

విద్యార్థి పంతులు వేషధారణలో విశ్వ వసు నామ నూతన సంవత్సర పంచాంగాన్ని విద్యార్థులకు వివరించారు. సంవత్సరంలో జరిగే విషయాలను క్లుప్తంగా తెలియజేశారు.

ఉగాది పచ్చడి..

షడ్రుచుల ఉగాది పచ్చడి జీవితంలో జరిగే వివిధ అనుభవాలకు ప్రతీకగా ఒక్కొక్క పదార్థం ఒక్కొక్క భావాన్ని, అనుభవాన్ని విద్యార్థులకు వివరించారు. బెల్లం ఆనందానికి సంకేతం, ఉప్పు జీవితంలో ఉత్సాహానికి సంకేతం, వేప పువ్వు చేదు జ్ఞాపకాలు, చింతపండు నేర్పుగా వ్యవహరించే తీరు, పచ్చి మామిడి కొత్త సవాళ్లను ఎదుర్కోవడం, కారం సహనం కోల్పోయే పరిస్థితులు వంటి విషయాలపై విద్యార్థులకు తెలియజేశారు.



పంచాంగాన్ని వినిపిస్తున్న విద్యార్థి



విద్యార్థులు తయారు చేసిన పచ్చడిని పంచుతూ..



కట్టెల పొయ్యిపై పోలెలు(బక్షాలు) వేస్తూ..

'సాక్షి'కి కృతజ్ఞతలు



గత సంవత్సరంలో జరిగిన చేదు అనుభవాలకు వీడ్కోలు పలికి వచ్చే తెలుగు నూతన సంవత్సరంలో మంచి జరగాలని 'సాక్షి' ఆధ్వర్యంలో చేపట్టిన ఉగాది వేడుకకు ఎస్‌పీఆర్ గ్లోబల్ స్కూల్ వేదిక అవడం సంతోషంగా ఉంది. ఈ సంవత్సరంలో వర్షాలు విస్తారంగా పడి, పాడి పంటలు పండాలి. ఇంగ్లీషు సంవత్సరానికి బదులు తెలుగు సంవత్సరం ఉగాది పండుగ యొక్క ప్రాధాన్యతను నేటి యువత తెలుసుకోవాలి.

– సొంటిరెడ్డి పున్నారెడ్డి, ఎస్‌పీఆర్ గ్లోబల్ స్కూల్ చైర్మన్

సదస్సులతో విద్యార్థులకు అవగాహన

- హెచ్‌సీయూ వీసీ బీజేరావు
- వీజేఐఎంలో అంతర్జాతీయ సదస్సు



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

నిజాంపేట్ : సదస్సులతో పారిశ్రామిక రంగంలో జరుగుతున్న అనేక విషయాలపై విద్యార్థులకు అవగాహన కలుగుతుందని హెచ్‌సీయూ వీసీ, ప్రొఫెసర్ బీజేరావు అన్నారు. విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో స్థిరమైన వ్యాపార సరళిలో భవిత్తు వాణిజ్య వ్యవహారాల నిర్వహణ అనే అంశంపై 7వ అంతర్జాతీయ సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం మరియానో మరికోస్ స్టేట్ యూనివర్సిటీ, ఫిలిప్స్ డా.అరేలీనే గొంజాలెస్ నైతిక పద్ధతులకు అనుగుణంగా మార్కెటింగ్ వ్యూహాలను ఎలా పునర్నిర్మించుకోవచ్చన్న దాని గురించి విలువైన సలహాలను అందించారు. కార్యక్రమంలో విజ్ఞాన జ్యోతి జనరల్ సెక్రటరీ కోడె దుర్గాప్రసాద్, డైరెక్టర్ డా.భరత్ భూషణ్ సింగ్, పానెల్ బిజినెస్ సంధానకర్తగా డా.రవినాథ్, కన్వీనర్స్‌గా డా.వినీత్ దాని, డా.అమర్నాథ్‌రెడ్డి, వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందజేయాలి

దుండిగల్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులకు అండగా ఉండడానికి ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన రాజీవ్ యువ వికాసం పథకం కోసం అవసరమైన ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో జాప్యం జరగకుండా చూడాలని కాంగ్రెస్ నేతలు కోరారు. ఈ మేరకు దుండిగల్, బాచుపల్లి, కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు బైరి ప్రశాంత్ గౌడ్, ఓబీసీ సెల్ రాష్ట్ర జాయింట్ కో ఆర్డినేటర్ భరత్ గౌడ్, జక్కుల మల్లేష్, పరశురాం గౌడ్, ధర్మారెడ్డి, శ్రీనివాస్, దుండిగల్ మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతకింది సురేష్, జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తుడి రిమాండ్

- రూ.20 లక్షల నగలు రికవరీ
- ఊరెళ్తున్నట్లు నేరస్తుడి భార్యకు సమాచారం ఇచ్చిన బాధితురాలు

జీడిమెట్ల: తాళం వేసి ఉన్న ఇంట్లో 25 తులాల బంగారు నగలు, 15 తులాల వెండి వస్తువులు అపహరించిన పాతనేరస్తుడిని బాచుపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. గురువారం బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్ అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ ఉపేందర్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ప్రగతినగర్‌కు చెందిన నీరీష ఈ నెల 21న ఇంటికి తాళం వేసి పని నిమిత్తం ఇస్నాపూర్ వెళ్లింది. తిరిగి 23వ తేదీన ఇంటికి వచ్చి చూడగా.. ప్రధాన ద్వారం తెరచి బీరువాలో ఉన్న 25 తులాల బంగారు, 15 తులాల వెండి నగలు కనిపించలేదు. ఈ విషయమై అదే రోజు బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాల ద్వారా దొంగతనం చేసింది కూకట్‌పల్లికి చెందిన పాతనేరస్తుడు నాసర్(34)గా గుర్తించారు. ఈ నెల 26న అతడిని బాచుపల్లిలోని ఫర్నీచర్ దుకాణంలో అదుపులోకి తీసుకున్నారు. సోదా చేయగా ప్రగతినగర్‌లో దొంగిలించిన 25 తులాల బంగారు నగలు, 15 తులాల వెండి వస్తువులు బ్యాగులో లభించాయి. ఈ మేరకు నాసర్‌ను అదుపులోకి తీసుకుని గురువారం రిమాండుకు తరలించారు. కాగా నాసర్‌పై అప్పటికే ఆరు కేసులు ఉన్నాయి. 2019లో అతనిపై పీడీ యాక్టు ఉండగా సంవత్సరం జైలులో ఉన్నాడు.

బాధితురాలి సమాచారంతోనే దొంగతనం!

నాసర్ 2016లో సగ్మా అనే ఆమెను పెళ్లి చేసుకున్నాడు. 2017లో వివాహమై ఇద్దరు పిల్లలున్న మరో మహిళ శోభారాణిని వివాహం చేసుకున్నాడు. బాధితురాలు నీరీష నాసర్ రెండో భార్య శోభారాణికి స్నేహితురాలు. ఈనెల 21న నీరీష ఊరికి వెళ్లేముందు శోభారాణికి సమాచారం ఇచ్చింది. ఈ విషయం తెలుసుకున్న నాసర్ మరుసటి రోజే నీరీష ఇంట్లో దొంగతనం చేశాడు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి దొంగను పట్టుకున్న ఏసీపీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, డీఐ యాదయ్యగౌడ్, క్రైం స్టాఫ్ డీఎస్ఐ డి.చంద్రశేఖర్, టి.అంజయ్య, టి.శ్రీనివాస్, ఎం.కనకయ్యలను డీసీపీ అభినందించి రివార్డులు అందజేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

దుండిగల్: నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి ఒక్కసారిగా కిందపడి మృతి చెందాడు. ఈ సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 23వ తేదీన బాచుపల్లి నుంచి మల్లంపేటకు నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి ముత్తూట్ ఫైనాన్స్ వద్ద అకస్మాత్తుగా కింద పడి చనిపోయాడు. స్థానికుల సమాచారం మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉంటుందని, షర్టుపై నిప్పన్ సర్వీసెస్ అనే స్టిక్కర్ ఉందని, మృతుడి వివరాలు తెలిస్తే పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

జీడిమెట్ల: చదువుకునే పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం సంతోషంగా ఉందని దాతలు ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ డీఈ రాజనర్సు, ఏఈ స్వప్న అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ సాయిబాబానగర్‌కు చెందిన ప్రత్యూష డీఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతుంది. విద్యార్థిని తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు మూడే రవినాయక్ విషయాన్ని దాతలకు తెలపగా.. వారు గురువారం విద్యార్థినికి రూ.25 వేలు అందజేశారు. కార్యక్రమంలో క్లెం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి

రంగారెడ్డినగర్: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డినగర్ డివిజన్ ఆదర్శ్‌నగర్ కమిటీ హాల్‌లో జరిగిన జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ సన్నాహక సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విలువలకు కట్టుబడిన పార్టీ కాంగ్రెస్ అని, జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం ద్వారా కాలనీలలో పాదయాత్రలు నిర్వహించి ప్రభుత్వ విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కొన్ని శక్తులు రాజ్యాంగానికి, దేశ భవిష్యత్‌కు ప్రమాదకరంగా మారుతున్నాయని, వాటిని ఎదుర్కొని దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సిరెడ్డి భూపతిరెడ్డి, రంగారెడ్డినగర్, జగద్గిరిగుట్ట డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణ నిర్మూలన అందరి బాధ్యత

సుభాష్‌నగర్: మానవ అక్రమ రవాణ నిర్మూలన మనందరి బాధ్యత అని కుత్బుల్లాపూర్ సీడీపీవో రేణుక, ప్రజ్వల సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామ కృష్ణ అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ కుత్బుల్లాపూర్ ప్రాజెక్టులో భాగంగా గురువారం సురారంలోని లూయిస్ బ్రెయిలీ భవనంలో రెండు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని రేణుక జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచం వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తోందని, దీంతో ఎంతో మంది అమ్మాయిల జీవితాలు నాశనమవుతున్నాయన్నారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి అమ్మాయిలు ఉద్యోగం, ప్రేమ పెళ్లి, సినిమా అవకాశాల పేరుతో మోసాలకు గురి అవుతున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్‌లు తమ పరిధిలోని మహిళలకు, అమ్మాయిలకు అక్రమ రవాణాపై అవగాహన కల్పించాలని, ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. శిక్షణలో సూపర్ వైజర్‌లు కృష్ణ ప్రియ, సుజాత, శ్రీదేవి, స్పందన, ప్రజ్వల ప్రతినిధులు సురేష్ కుమార్, అంబర్‌సింగ్, మిథాలీ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కుత్బుల్లాపూర్: సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తోందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధి జయభేరి పార్క్ బాలాజీ హైట్స్ అపార్ట్‌మెంట్ నుంచి అమర్‌తేజ అపార్ట్‌మెంట్ వరకు రూ. 27 లక్షల మున్సిపల్ నిధులతో సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని, అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్, కోఆపరేటివ్ మాజీ డైరెక్టర్ జమ్మి దేవేందర్, మాజీ ఉప సర్పంచ్ అన్నారం గోపాల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ఆదిరెడ్డి మోహన్ రెడ్డి, జిల్లా లేబర్ సెల్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు కావాలి గోపాల్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మాధవి, మాజీ కో ఆప్షన్ మెంబర్ ఇబ్రహీం, అశోక్ రెడ్డి, పూర్ణచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్ తైబజార్ వేలం

నిజాంపేట్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గురువారం తైబజార్ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో మొత్తం 8 మంది పోటీదారులు పాల్గొన్నట్లు కమిషనర్ సాబేర్ అలీ తెలిపారు. రూ.45.30 లక్షలకు ప్రశాంత్ కుమార్ దక్కించుకున్నట్లు కమిషనర్ తెలిపారు.

ఘనంగా ప్రపంచ రంగస్థల దినోత్సవం



నిజాంపేట్ : బాచుపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కమిటీ హాల్ పరిపాలనా భవనంలో గురువారం ఉదయం ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, సభాధ్యక్షులుగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆచార్య కోట్ల హనుమంతరావు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళలశాఖ శాఖాధిపతి డా.జీహెచ్.ఎద్మప్రియ పాల్గొన్నారు. అనంతరం పురస్కార గ్రహీత రంగస్థల నటులు శ్రీకాంత్ నందకుమార్ భలేరావ్‌కు జె.ఎల్. నరసింహారావు రంగస్థల యువ పురస్కారం ప్రదానం చేశారు.

ప్రభుత్వ స్థలాలను పరిశీలించిన 'హైడ్రా'



వివరాలు తెలుసుకుంటున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

సుభాష్‌నగర్: హైడ్రా కమిషనర్ రంగనాథ్ గురువారం గాజులరామారంలోని పలు ప్రభుత్వ భూములను పరిశీలించారు. ప్రభుత్వ స్థలాల గురించి డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునరావును అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సూరారంలోని సర్వే నంబర్ 29 లోని ఎస్ఎఫ్‌సీ రోడ్డు స్థలం వివాదం గురించి తెలుసుకున్నారు. సర్వే నంబర్ 307లోని ఎస్ఎఫ్‌సీ స్థలంలో పోస్తున్న మట్టిపై ఆరా తీశారు. ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటి సరిహద్దులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

పారిశుద్ధ్య కార్మికురాలికి చేయూత



కుత్బుల్లాపూర్: విధులు నిర్వహిస్తుండగా కారు ఢీకొట్టడంతో గాయపడి చికిత్స చేయించుకున్న కార్మికురాలికి బీజేపీ నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. కొంపల్లి మున్సిపల్‌లో పారిశుద్ధ్య కార్మికురాలిగా పని చేస్తున్న బాలమణి విధుల్లో భాగంగా ఏమరాల్డ్ అపార్ట్‌మెంట్ వద్ద చెత్త ఊడుస్తుండగా వెనుక నుంచి కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో ఆమె నడుము కింద భాగంలో విరగడంతో సర్జరీ చేశారు. ఇటీవలే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ కావడంతో విషయం తెలుసుకున్న బీజేపీ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు సతీష్‌సాగర్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ శివాజీరాజు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు జనార్దన్‌రెడ్డి గురువారం పరామర్శించారు. రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

గాయపడిన వ్యక్తికి పోలీసుల ప్రథమ చికిత్స



ప్రథమ చికిత్స చేస్తున్న అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు

కుత్బుల్లాపూర్: బైక్ స్కిడ్ కావడంతో గాయపడిన వాహనదారుడికి అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు ప్రథమ చికిత్స చేసి ఆసుపత్రికి తరలించారు. అల్వాల్ మంగాపురం గేట్ సమీపంలో ఓ ద్విచక్ర వాహనదారుడు జారీ పడటంతో అతని చేతికి, కాలికి గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు ద్విచక్ర వాహనదాడికి ప్రథమ చికిత్స చేసి సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ సూచించారు.